ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక



Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 201

గురువారం 30 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## పని మాది.. ప్రచారం చంద్రబాబుది: జగన్



భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ తన ఖాతాలోకి వేసుకునేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారన్న జగన్
విమానాశ్రయానికి సంబంధించిన అన్ని పనులు తమ హయాంలోనే జరిగాయని వ్యాఖ్య

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

2026 నాటికి విమాన రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామన్న జగన్ భోగాపురం విమానాశ్రయాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్ర బాబు దొంగ దారులు వెతుకుతున్నారని, కిరీటం వేసుకోవడంలో ఆయన చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపరని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలోనే ▶ 2లో

## ఎర్రబస్సు రాని ప్రాంతానికి ఎయిర్ బస్సులు ఎందుకు అన్నారు: జగన్ పై ఎంపీ కలిశెట్టి ఫైర్



గతంలో జగన్ భోగాపురం గురించి హేళనగా మాట్లాడారన్న కలిశెట్టి
జగన్ క్రెడిట్ చోరీ చేస్తే జైలుకే వెళ్లాల్సి ఉంటుందని ఎద్దేవా
డీఎస్సీ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగలేదన్న ఎంపీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

భోగాపురం విమానాశ్రయం క్రెడిట్‌ను చంద్రబాబు కొట్టేస్తున్నారంటూ వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హాస్యాస్పదమని విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎద్దేవా చేశారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్ భోగాపురం వచ్చి... "ఎర్రబస్సు సరిగ్గా రాని ఈ ప్రాంతానికి ఎయిర్‌పోర్ట్, ఎయిర్ బస్సులు ఎందుకు?" అంటూ తీవ్రంగా ▶ 2లో

# పునరుత్పాదక ఇంధన హబ్‌గా రాయలసీమ..



## రూ. 5,350 కోట్లతో టాటా పవర్ ప్లాంట్లు

- రాయలసీమలో టాటా పవర్ భారీ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు
- రూ. 5,350 కోట్ల పెట్టుబడితో 800 మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటు
- పత్తికొండలో రేపు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేశ్
- పరిశ్రమల విద్యుత్ అవసరాలు తీర్చడమే ప్రధాన లక్ష్యం
- నిర్మాణ దశలో సుమారు 4,000 మందికి ఉపాధి అవకాశాలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

రాయలసీమను పునరుత్పాదక ఇంధన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కర్నూలు, అనంతపురం జిల్లాల్లో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల భారీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ రేపు శంకుస్థాపన చేయనున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ ప్రాజెక్టుల మొత్తం పెట్టుబడి విలువ రూ. 5,350 కోట్లు కావడం గమనార్హం.

రాష్ట్రానికి వస్తున్న భారీ పరిశ్రమలకు నిరంతరాయంగా, నాణ్యమైన పునరుత్పాదక ఇంధనాన్ని అందించడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఇటీవల ప్రకటించిన 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024'కు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపడుతున్నారు. రాష్ట్రంలోని యుటిలిటీలు, డిస్కమ్‌లు, వాణిజ్య, పారిశ్రామిక ▶ 2లో

## జగన్.. సాక్ష్యాలు తారుమారు చేసిన వ్యక్తిని పరామర్శించి ఏం సందేశమిస్తారు?: చంద్రబాబు

జగన్.. సాక్ష్యాలు తారుమారు చేసిన వ్యక్తిని పరామర్శించి ఏం సందేశమిస్తారు?: చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

వ్యవస్థల నిర్మాణం చేసేవాళ్లు చట్టాలకు లోబడి నడుచుకుంటారని.. గొడ్డలి పార్టీ నేతలకు వాటిపై గౌరవం లేదని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న నేతలో సీఎం సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై వారితో ఆయన చర్చించారు. జైలులో ఉన్న వైకాపా నేత సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ వెళ్తున్న విషయాన్ని నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వ్యవస్థలను నాశనం చేయడాన్ని గొడ్డలి పార్టీ అధినేత లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ▶ 2లో

## పార్టీ గీత దాటితే చూస్తూ ఊరుకునేది లేదు: బొండా ఉమా ఎపిసోడ్‌పై పల్లా శ్రీనివాసరావు

పార్టీ కంటే ఎవరూ గొప్ప కాదన్న పల్లా శ్రీనివాసరావు
అధినేత చంద్రబాబు నిర్ణయాలే అందరికీ శిరోధార్యమని స్పష్టీకరణ
బొండా ఉమా వివరణ సంతృప్తికరంగా ఉందని వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని, పార్టీ విధానాలు, అధినేత ఆదేశాల కంటే ఎవరూ గొప్పవారు కాదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇటీవల తాటిపాకలో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ వివాదంపై ఎమ్మెల్యే బొండా ఉమా ఇచ్చిన వివరణపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ గీత దాటితే ఎంతటివారైనా సరే చూస్తూ ఊరుకునేది లేదని, కఠిన చర్యలు తీసుకునేందుకు సైతం వెనకాడమని పల్లా హెచ్చరించారు. "ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయాలే అందరికీ శిరోధార్యం. ఇతర రాజకీయ ప్రత్యర్థులు, విపక్ష నేతలతో వేదికలు పంచుకోవద్దని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తప్పనిసరి పరిస్థితుల్లో హాజరైనా సదరు కార్యక్రమానికే పరిమితం కావాలి తప్ప, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఎవరూ మాట్లాడకూడదు" అని తేల్చిచెప్పారు. ఇక ఈ వివాదంలో బొండా ఉమా ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా ఉందని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. అధినేత చంద్రబాబు మాట జవదాటనని, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని బొండా స్పష్టం చేశారని... దాంతో ఈ వివాదం ముగిసిన అధ్యాయమని పల్లా స్పష్టం చేశారు.

## ఆగస్టు 17 తర్వాత భోగాపురం నుంచే విమానయానం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి విమాన రాకపోకలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ప్రకటించింది. 30 ఏళ్లపాటు విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు తెలిపింది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, ▶ 2లో

## మేమేమైనా అంటరానివాళ్లమా?: చంద్రబాబుపై అంబటి ఫైర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో తన పక్కన కూర్చున్నందుకు టీడీపీ నేత బొండా ఉమాకు ఆ పార్టీ అధిష్ఠానం నోటీసులు ఇవ్వడంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు విరుచుకుపడ్డారు. పార్టీలు వేరైనా కాపు సామాజికవర్గ కార్యక్రమాల్లో నేతలు కలవడం సహజమని, అంతమాత్రానికే బొండా ఉమా నుంచి వివరణ కోరడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. తామిద్దరం పక్కపక్కనే కూర్చోవడం ▶ 2లో

## రూ.2 వేల కోట్ల భూమిని.. ప్రభుత్వానికి స్వాధీన పరచాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 29)

విశాఖపట్నంలోని గాజువాక నియోజకవర్గం అగనంపూడి వద్ద జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న 174.43 ఎకరాల భూమిని ప్రభుత్వానికి తిరిగి స్వాధీన పరచాలని అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ అభిప్రాయపడింది. దీనిపై బ్యాంకర్లు, పరిశ్రమలు, ఆర్థికశాఖ అధికారులతో వచ్చే నెల 7న చర్చించి ఈ అంశాన్ని కొలిక్కి తేవాలని నిర్ణయించింది. కమిటీ ఛైర్మన్ అయిన ఉపసభాపతి



రఘురామకృష్ణరాజు అధ్యక్షతన మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో సమావేశం నిర్వహించారు. సభ్యులైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్‌రాజు, జగన్మోహన్, ▶ 2లో

## ఉక్రెయిన్ ఓడరేవుపై దాడికి ఇరాన్ ప్లాన్..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 29)

పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలు కలిపి ప్రాంతీయ యుద్ధంగా విస్తరించే ప్రమాదం కన్పిస్తోంది. తమ నౌకలపై కీవ్ దాడులకు గానూ ఇరాన్ ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఉక్రెయిన్ ఓడరేవుపై దాడికి టెహ్రాన్ సన్నాహాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా పత్రిక సంచలన కథనం ప్రచురించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్‌లో అంతరాయం నేపథ్యంలో.. ఇరాన్‌కు కాస్పియన్ సముద్రం



కీలకమైన వాణిజ్య మార్గంగా మారింది. ఈ క్రమంలోనే ఈ జలమార్గంలో నౌకలపై ఉక్రెయిన్ దాడులకు పాల్పడటం ఉద్రిక్తతలకు దారితీసిన సంగతి తెలిసిందే. గతవారం ఇరాన్ వాణిజ్య నౌకపై కీవ్ జరిపిన దాడిలో ఓ నావికుడు మృతిచెందాడు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన టెహ్రాన్.. కీవ్‌పై ప్రతీకారానికి ప్రణాళిక రూపొందించినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. నల్ల సముద్రంలో ఉక్రెయిన్‌కు చెందిన ఓ ఓడరేవును ఇరాన్ లక్ష్యంగా చేసుకోవాలని అనుకున్నట్లు తెలిపాయి. ఆ పోర్టుపై చిన్న స్థాయి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించాలని ప్లాన్ చేసినట్లు పేర్కొన్నాయి. దీని వల్ల నష్టం తక్కువే అయినప్పటికీ.. ఉక్రెయిన్‌ను బెదిరించడానికి ఈ దాడి చేయాలని టెహ్రాన్ భావించినట్లు సదరు వర్గాలు తెలిపాయి. ఒకవేళ ఈ దాడి జరిగితే.. ఉక్రెయిన్ ఎలా స్పందిస్తుందన్నది అంచనా వేయడం కష్టం. ఈ పరిణామాలతో యుద్ధం విస్తరించే అవకాశం ఉందని పశ్చిమ దేశాలు ఒకింత ఆందోళనకు ▶ 2లో

మొదటిపేజీ తరువాయి

## పునరుత్పాదక ఇంధన హబ్‌గా రాయలసీమ..

సంస్థల విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంలో ఈ ప్లాంట్లు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కర్నూలు జిల్లా పత్తికొండలో 2,700 ఎకరాల్లో రూ. 2,250 కోట్ల వ్యయంతో 400 మెగావాట్ల సోలార్ ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా అనంతపురం జిల్లా కనేకల్లులో 760 ఎకరాల విస్తీర్ణంలో రూ. 3,500 కోట్ల పెట్టుబడితో 400 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. అనంతపురంలోని విండ్ ప్రాజెక్టును సుజ్లాన్ సంస్థ సాంకేతిక సహకారంతో టాటా పవర్ అభివృద్ధి చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణ దశలో సుమారు 4,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన 1,100కు పైగా రైతు కుటుంబాలకు దీర్ఘకాలిక ఆర్థిక భద్రతతో పాటు స్థిరమైన ఆదాయం లభించనుంది. ఈ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను జాతీయ గ్రిడ్‌కు సమర్థవంతంగా తరలించేందుకు ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ (ఐఎస్‌టీఎస్) కనెక్టివిటీని కూడా సాధించారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల స్వచ్ఛమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనకు ఈ ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయని భావిస్తున్నారు.

## పని మాది.. ప్రచారం చంద్రబాబుది: జగన్

ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా జగన్ స్పందిస్తూ... "2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ 2020లో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతీదీ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి" అని స్పష్టం చేశారు.

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ. 1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు. కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే... ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు.

## ఎర్రబస్సు రాని ప్రాంతానికి ఎయిర్ బస్సులు ఎందుకు అన్నారు: జగన్ పై ఎంపీ కలిశెట్టి ఫైర్

అవహేళన చేశారని ఎంపీ గుర్తుచేశారు. జగన్ సాధించిన 'ప్రత్యేక క్రెడిట్'ను ఎవరూ దొంగిలించరని, ఒకవేళ ఆయన క్రెడిట్‌ను ఎవరైనా చోరీ చేస్తే చివరకు జైలుకే వెళ్లాల్సి వస్తుందంటూ ఘాటుగా సెటైర్ వేశారు. జగన్ మాటలు చూసి ఉత్తరాంధ్ర ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

ఇక త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కాబోతోందని అప్పలనాయుడు స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలో నారా లోకేశ్ నాయకత్వంలో విద్యాశాఖ ఎంతో పారదర్శకంగా పనిచేస్తోందని, డీఎస్సీ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరగకుండా నిష్పాక్షికంగా నిర్వహించారని చెప్పారు. లోకేశ్ విసిరిన సవాలును స్వీకరించలేక జగన్ పారిపోయారని ఎద్దేవా చేశారు.

## జగన్.. సాక్ష్యాలు తారుమారు చేసిన వ్యక్తిని పరామర్శించి ఏం సందేశమిస్తారు?: చంద్రబాబు

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి చనిపోతే సాక్ష్యాలను తారుమారు చేసి మరొకరి జీవితాన్ని బలిచేద్దాం అనుకున్నవారిని జగన్ పరామర్శించి సమాజానికి ఏం సందేశం ఇస్తారని ప్రశ్నించారు. "గతంలో కారు చక్రాల కింద వ్యక్తి నలిగిపోతే కనీసం ఆస్పత్రికి తీసుకెళ్దామనే మానవత్వం కూడా గొడ్డలి పార్టీ అధినేతకు లేదు. పుట్టినరోజులకు జంతు బలులతో రాక్షసానందం పొందే హింసా ప్రవృత్తి ఆ పార్టీది. నేరాల నియంత్రణకు 2014-19 మధ్య రాష్ట్రవ్యాప్తంగా 15వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. 2019-24 మధ్య నిర్వహణ లేక వాటన్నింటినీ నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే వాటిని పునరుద్ధరించడంతో నేరస్థుల్ని సాక్ష్యాలతో సహా పట్టుకోగలుగుతున్నాం. రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ చనిపోతే హత్యగా చిత్రీకరించి బురదచల్లాలని చూశారు. సీసీటీవీ ఫుటేజ్‌లతో ఆధారాలు బయటపెట్టేసరికి తోక ముడిచారు. నేరప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి ఎదుటివారిపై రుద్దాలని చూస్తారు. అలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్థుల్ని పరామర్శించడమే గొడ్డలి పార్టీ పనిగా పెట్టుకుంది" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## ఆగస్టు 17 తర్వాత భోగాపురం నుంచే విమానయానం

లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని.. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని పేర్కొంది. ఇప్పటి వరకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' ఆగస్టు 17 అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం తెలిపింది.

### అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు

జీఎంఆర్ సంస్థ పీపీపీ విధానంలో నిర్మించిన భోగాపురానికి విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని 2024 సెప్టెంబర్ 18న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ఇప్పుడు కేంద్రం దాన్ని అధికారికంగా గుర్తిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసిం

## ఉక్రెయిన్ ఓడరేవుపై దాడికి ఇరాన్ ప్లాన్..

గురయ్యాయి. అయితే, ఇరాన్-ఉక్రెయిన్ మధ్య దౌత్య చర్చలతో ఈ వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగినట్లు తెలుస్తోంది. కాస్పియన్ సముద్రంలో ఉద్రిక్తతలను పరిష్కరించుకునేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మంగళవారం ఉక్రెయిన్ విదేశీ వ్యవహారాల మంత్రి ఆండ్రీ సిబిహాతో ఫోన్‌లో మాట్లాడారు. నౌకపై దాడి ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని కీవ్ మంత్రి వివరించారు. దీంతో టెహ్రాన్ వెనక్కి తగ్గింది. ఈ ఫోన్‌కాల్ అనంతరం అరాగ్చీ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. "ఈ ఉద్రిక్తతలను మరింత పెంచాలని ఇరాన్ భావించట్లేదు. కానీ, మా దేశ ప్రయోజనాలు, పౌరులపై దాడులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కావు. మా నష్టాన్ని పూడ్చాల్సిందే" అని రాసుకొచ్చారు. కాగా.. ఈ దాడిలో నౌక ధ్వంసమైనందుకు గానూ పరిహారం చెల్లించేందుకు ఉక్రెయిన్ అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ పరిణామాలతో ఉద్రిక్తతలు పూర్తిగా సమసిపోతాయన్నది మాత్రం కచ్చితంగా చెప్పలేమని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ మధ్య ఘర్షణలతో నల్ల సముద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ ఓడరేవులో ఓ కార్గో నౌకలో 13 మంది భారతీయ నావికులు చిక్కుకుపోవడం గమనార్హం.

## మేమేమైనా అంటరానివాళ్లమా?: చంద్రబాబుపై అంబటి ఫైర్

అంత పెద్ద తప్పా అని ప్రశ్నించిన అంబటి... తెలుగుదేశంలో ఉన్న కాపులతో తప్ప మిగిలిన కాపు నేతలతో ఎవరూ మాట్లాడకూడదని టీటీడీలో ఏదైనా ప్రత్యేక రూల్ ఉందా? అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. వయసు పెరుగుతున్న కొద్దీ చంద్రబాబుకు బుద్ధి తగ్గుతోందని, తమను అంటరానివారిగా భావిస్తున్నారా? అని నిలదీశారు. కాపు నేతల సభల్లో జనసేన, ఇతర పార్టీల నాయకులు కూడా కలుస్తుంటారని, అంతమాత్రాన అది తప్పైపోతుందా? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో వర్షాల్లేక, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. వాటిపై దృష్టి పెట్టకుండా తన పక్కన బొండా ఉమా కూర్చోవడాన్నే చంద్రబాబు పెద్ద సమస్యగా మార్చారని అంబటి ఎద్దేవా చేశారు. ప్రత్యర్థి పార్టీల నేతలతో వేదికలు పంచుకోకూడదనే నెపంతో కాపు ఐక్యతను, నేతల మధ్య సంబంధాలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రూ.2 వేల కోట్ల భూమిని.. ప్రభుత్వానికి స్వాధీన పరచాలి

సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశానంతరం వారు విలేకరులతో మాట్లాడారు. 'రీఫ్రాక్టరీస్ అనే సంస్థకు 1991లో అగనంపూడి వద్ద 174.43 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిపై రూ. 19 కోట్ల రుణం తీసుకున్నారు. తర్వాత ఆ సంస్థ నిరర్థక ఆస్తి(నాన్ ఫెర్ఫార్మింగ్ అసెట్)గా ఆ యూనిట్‌ను విడిచి వెళ్లిపోయింది. తర్వాత మూడో పార్టీకి ఆ యూనిట్‌ను రూ. 45 కోట్లకు ఇచ్చారు. అందుకు ఏపీఐఐసీ ఎన్‌ఓసీ ఇవ్వకుండా ఆపేసింది. భూమి ప్రస్తుత విలువ సుమారు రూ. 2 వేల కోట్లపైనే. బ్యాంకర్లతో మాట్లాడి ఆ భూమిని ప్రభుత్వం చేతికి అప్పగించాలి' అని పల్లా శ్రీనివాసరావు అన్నారు. విశాఖస్టీల్ నిర్వాసితుల ఆర్-కార్డుల అంశమై చర్చించామని శ్రీనివాసరావు తెలిపారు. 1,203 కార్డులను నకిలీవంటూ పక్కనపెట్టారని తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్డులు జారీ సమయంలో వయసు తదితర ఆధారాలు లేకపోవడం వల్ల సమస్య తలెత్తిందని, కాబట్టి ఆ కార్డులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

## ఘణంగా గురు పౌర్ణమి వేడుకలు





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 29)** గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని కోత్తపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీ శిరిడి సాయి బాబా అలయం నందు వేడుకలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. అజ్ఞానమనే అంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే బాబాను స్మరించుకుంటూ తెల్లవారుజాము నుండే భక్తులు ఆలయనికి పోటెత్తారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, దేవాలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాజు శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసారు. బాబాను ప్రత్యేక పూలతో అలకంరించారు. ఇ సందర్భంగా బాబాకు కాకడ హారతి, మహానివేదన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అలయ కమిటీ అన్నధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయకమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పెన్షనర్స్ పితామహుడు డి యస్ నకారా వర్ధంతి





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 29)** పొదిలి పెన్షనర్ల భవనములో పెన్షన్ పితామహుడు, ఫాదర్ ఆఫ్ ద పెన్షనర్స్ అయిన డి యస్ నకారా వర్ధంతి సభ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ మదార్ వలి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. నకారా సుప్రీంకోర్టులో కేసు వేసి పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, ప్రభుత్వ దయాదాక్షిన్యాలపై ఆధారపడేది కాదని, ఉద్యోగులు గతంలో చేసిన సేవలకు ప్రతిఫలమని సుప్రీంకోర్టులో వాదించి పెన్షన్ హక్కును సాధించారని, ప్రస్తుతం ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షన్ పొందుతూ ఆనందంగా జీవించడానికి కారణం ఈ నకారా అని ప్రధానకార్యదర్శి షేక్ మదార్ వలి తెలిపారు. పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ బాదుల్లా , అసోసియేటెడ్ అధ్యక్షులు డిఎల్ నరసింహారావు నకారా జీవిత చరిత్రను, కేంద్ర సర్వీసులలో వారు నిర్వహించిన పదవులను, హోదాలను పెన్షన్ హక్కు కొరకు ఆయన చేసిన పోరాట పటిమలను వివరంగా తెలిపారు. తదుపరి నకారా వర్ధంతి సందర్భంగా భవిత పాఠశాలలోని మూగ, చెవిటి, మానసిక వికలాంగ విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మదార్ వలి, బాదుల్లా, వీరారెడ్డి, డిఎల్ నరసింహారావు, దాసరి గురుస్వామి, కె యల్లమందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి స్థలం దగ్గర ఘర్షణ

**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 29)** మండలంలోని చెరుకూరు గ్రామంలో ఇంటి స్థలం దగ్గర ఘర్షణ చోటు చేసుకుంది. కుంచాల మాల్యాద్రి శిథిల వ్యవస్థలో ఉన్న ఇంటిని పడేసి ఆ స్థలమును శుభ్రపరిచాడు అయితే కుంచాల మాధవ మాధవ హైదరాబాదులో నివసిస్తున్నాడు విషయం తెలుసుకున్న మాధవ చెరుకూరు గ్రామానికి వచ్చి మాల్యాద్రిపై మాధవ భార్య లక్ష్మి తన్నీరు నరసింహం వెళ్లి ఈ స్థలంలో మాకు హక్కు ఉందని మాల్యాద్రి నీ కొట్టి చంపేస్తామని బెదిరించారు. మాల్యాద్రి పొన్నలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాధవ కూడా వచ్చి మమ్మల్ని కొట్టబోయాడని ఎస్ఐ కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఇరువురిని పిలిపించి మీ దగ్గర ఉన్న ఆధారాలు తీసుకొని రండి అని చెప్పాడు. కుంచాల మాల్యాద్రి తన డాక్యుమెంట్ తీసుకొని ఎస్ఐకి ఇచ్చాడు, మాధవ ఇంటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు తీసుకొని రాలేదు. ఎస్ఐ సత్యనారాయణ విచారించి మాధవ, భార్య లక్ష్మి, తన్నీరు నరసింహం పై కేసు నమో చేశారు.

## సాయిక్షేత్రంలో అంబరాన్నంటిన గురు పౌర్ణమి వేడుకలు

### భక్తిశ్రద్ధలతో స్వామివారికి దివ్యారాధనలు, ప్రత్యేక పూజలు
### వైద్యులు ఎర్రం వెంకటరెడ్డి దంపతులకు ఆలయ కమిటీ ఘన సన్మానం
### పట్టువస్త్రాల సమర్పణ




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 29)** పట్టణంలోని దర్శి రోడ్డులోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. బుధవారం ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను అత్యంత నిష్ఠ, భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి విశేష అభిషేకాలు, దివ్యారాధనలు, నవగ్రహ పూజలు, ప్రత్యేక అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ పావన వేడుకల సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధులు ప్రముఖ ఆర్ఎంపీ వైద్యులు ఎర్రం వెంకటరెడ్డి దంపతులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఆలయ వర్గాలు దంపతులకు శాలువా కప్పి, పట్టు వస్త్రాలు బహుకరించి తమ ఆత్మీయ గౌరవాన్ని చాటుకున్నాయి. అనంతరం వెంకటరెడ్డి దంపతులు బాబావారిని దర్శించుకుని, ప్రత్యేక అర్చనల్లో పాల్గొని ఆలయ ప్రధాన పూజారుల చేతుల మీదుగా వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## గిద్దలూరు హై స్కూల్ ప్లస్‌లో అమరావతి ఛాంపియన్షిప్ 2026 నియోజకవర్గ స్థాయి ఆటలు ప్రారంభం




**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 29)** గిద్దలూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో నియోజకవర్గ స్థాయి అమరావతి ఛాంపియన్షిప్ 2026 ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ మొరస బాల గురువయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా గిద్దలూరు మండల జడ్పిటిసి సభ్యులు బుడత మధుసూదన్ రావు యాదవ్, గిద్దలూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య యాదవ్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ షేక్ రసూల్ పాల్గొన్నారు. ఈ ఆటల పోటీలు రాష్ట్ర ప్రభుత్వం వారు షాప్ ఆధ్వర్యంలో జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు మూడు దశలలో నిర్వహిస్తుందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో ప్రతిభను ప్రదర్శించేలా చేయాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వము ఆగస్టు 29 క్రీడా దినోత్సవం రోజు ప్రతిభా పురస్కారాలతో సత్కరించడం జరుగుతుందని అధ్యక్షులు తెలియజేశారు. అండర్ 17, అండర్ 23 విభాగాలలో ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి కోఆర్డినేటర్‌గా ఫిజికల్ డైరెక్టర్ యస్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజర్‌గా గుర్రం శోభన్ బాబులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి స్వామి కుమార్, జి విజయరాజు, డాక్టర్ మొర్రి పిచ్చయ్యలు పాల్గొని అమరావతి ఛాంపియన్షిప్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, యోగ, వెయిట్ లిఫ్టింగ్, తదితర అంశాల్లో విజేతలను ఎన్నుకోవడం జరిగింది. దాదాపు ఎనిమిది రకాల విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఆరు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.







ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక
30.07.26 గురువారం

## పొదిలి నగర పంచాయతీ

# టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జిగా వరికుంట్ల అనిల్

అధిష్టానం ఆదేశాల మేరకు
ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సహకారంతో నియామకం
పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తా
మీడియాతో వరికుంట్ల అనిల్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 29)**
పొదిలి నగర పంచాయతీ పరిధిలో తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటు చేసుకుంది. పొదిలి నగర పంచాయతీ తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిగా యువనాయకుడు వరికుంట్ల అనిల్ (పండు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేయగా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకే ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు. రెండు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఈ పదవి ఎంతో ఉపయోగంగా మారనుంది. స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తూ, నాయకులు, కార్యకర్తల మధ్య వారధిగా అనిల్ వ్యవహరించాలని పార్టీ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి. తన పై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా పార్టీ నాయకత్వానికి వరికుంట్ల అనిల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని పొదిలిలో విజయవంతం చేస్తానన్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ, పొదిలి నగర పంచాయతీ అభివృద్ధిలో టిడిపికి తిరుగులేని శక్తినందించడానికి శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనిల్ నియామకం పట్ల పొదిలి పట్టణ, మండల టిడిపి నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల సౌకర్యాలను త్వరితగతిన పూర్తి చేయండి





అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 29)**
వెలిగొండ ప్రాజెక్టు పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల సౌకర్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం వెలుగొండ ప్రాజెక్టు పనుల పురోగతి, పునరావాస (తరువాయి 4లో...)

## నూతన మార్కాపురం జిల్లాలో

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశం

వేడుకలను జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలి
జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా శకటాలు, స్టాళ్ల ఏర్పాటుకు ఆదేశం





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 29)**
నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా జిల్లా చరిత్రలో ఒక మధుర స్మృతిగా నిలిచిపోయేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో ▶4లో



# కన్నెర్ర చేసి రోడ్డెక్కిన పొగాకు రైతులు

- ▶గిట్టుబాటు ధరలకై జాతీయ రహదారి దిగ్బంధనం
- ▶కిలో మీటర్ల కొద్ది నిలిచిపోయిన వాహనాలు
- ▶సరాసరి ధర కిలోకు రూ. 250 కల్పించాలి
- ▶కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. వెయ్యి కోట్లు నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థలచే కొనుగోలు చేయించాలని డిమాండ్
- ▶రైతు నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 29)**
గత మూడు నెలలుగా వర్జీనియా పొగాకు గిట్టుబాటు ధరల కోసం అనేక రూపాలలో ఆందోళనలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రకాశం జిల్లాలోని పొగాకు రైతులు కన్నెర్ర చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారిని ఒంగోలులోని త్రోవగుంట సమీపంలో, టంగుటూరు టోల్ ప్లాజా వద్ద వందలాది మంది రైతులు దిగ్బంధించారు. దీంతో కిలోమీటర్ల కొద్ది వాహనాలు జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. ఈ సందర్భంగా త్రోవగుంట సమీపంలో నిర్వహించిన జాతీయ రహదారి దిగ్బంధనం కార్యక్రమానికి నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా ప్రకాశం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ పొగాకు గిట్టుబాటు ధరల కోసం గత మూడు నెలలుగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు అనేక రూపాలలో ఆందోళనలు చేపడుతుంటే, ముఖ్యమంత్రికి కనీస స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడుగా ఇటీవల చంద్రబాబు నాయుడు లోగ్రేడ్ పొగాకును కిలోకు రూ.110 కొనుగోలు చేసేలా నిర్ణయించినట్లు పేర్కొన్నారన్నారు. 2026 జులై 21 నాటికి లోగ్రేడ్ పొగాకును సరాసరిన కిలోకు రూ. 1877కు కొనుగోలు జరిగిందన్నారు. ఒక్కసారిగా లోగ్రేడ్ పొగాకు ధరను రూ.110కి తగ్గించడం వెనక ఉన్న మర్మమేమిటో







## ముండ్లమూరులో మీకోసం

## మారెళ్ళ గ్రామంలో పల్లెనిద్ర



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 29)**
ఈ నెల 31వ తేదీన ముండ్లమూరులో ప్రత్యేక గ్రీవెన్స్ (మీకోసం) కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని దర్శి నియోజకవర్గ ప్రజలు వినియోగించుకోవాలని ▶4లో

## విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం

రెండు గేదలు బలి



**(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జులై 29)**
మండలంలోని సూదివారిపాలెం గ్రామానికి నాగండ్ల గ్రామం నుండి వ్యవసాయ భూముల్లో నుంచి వేసిన విద్యుత్ లైన్ తీగలు కిందకి వేలాడుతున్నాయి. విషయం తెలిసినా కూడా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎవరూ పట్టించుకోకపోవడంతో బుధవారం సుదివారిపాలెం గ్రామానికి చెందిన పాలపర్తి హరిబాబుకి సంబంధించిన రెండు గేదలు విద్యుత్ లైన్ తీగల తగిలి మృత్యువాత పడ్డాయి. వీటి ఖరీదు సుమారు రూ.2 లక్షలు ఉంటాయని రైతు తన బాధను వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరుతున్నాడు.

# కన్నెర్ర చేసి రోడ్డెక్కిన పొగాకు రైతులు








ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పాలని నిలదీశారు. ముఖ్యమంత్రికి రైతుల పట్ల ప్రేమ ఉన్నట్లు నటిస్తూ, కార్పొరేట్ వ్యాపారులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. లోగ్రేడ్ పొగాకును రూ. 110 కి అమ్ముకోండి, దానికి పరిహారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 2 వేలు బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించటం, గతంలో ఆయన చేసిన ప్రకటనలకు విరుద్ధం కాదా అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు నాయుడు పొగాకును సరాసరినా కిలోకు రూ. 200 కు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఏ ఒక్క పొగాకు వ్యాపారి, ముఖ్యమంత్రి ఆదేశాలను దాఖలు చేసిన పరిస్థితి లేదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కార్పోరేట్ వ్యాపారులు శాసిస్తున్నాయని, ప్రభుత్వాలు కూడా వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి రూ. 1000 కోట్లు నిధులు కేటాయించి, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పొగాకు కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. వర్జీనియా పొగాకు కు కిలోకు రూ. 250 ధర దక్కేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పొగాకు రైతులు పెనాల్టీల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించినందుకు వేల కోట్ల రూపాయలు రైతుల డబ్బులు ఉన్నాయన్నారు. అంతేకాకుండా పొగాకు ఎగుమతుల దేశానికి విదేశీ మార్కెట్ ద్రవ్యం లక్షల కోట్లు వస్తున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు రుణమాఫీలు చేసే కేంద్ర ప్రభుత్వం, పొగాకు రైతుల కోసం కేవలం రూ.1000 కోట్లు నిధులు కేటాయించలేదా అని ప్రశ్నించారు. రైతుల పోరాటాలకు సిపిఐ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య మాట్లాడుతూ వందరోజుల వజీరియ పొగాకు రైతు పోరాటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించి నిర్ణయం తీసుకున్న నిర్ణయాలు రైతులకు చాలా నష్టదాయకంగా ఉన్నాయన్నారు. ఏ గ్రేడ్‌ను కిలోకు రూ. 240, సి గ్రేడ్‌ను కిలోకు రూ.110 కొనుగోలు చేస్తామని, దానికి పరిహారంగా క్వింటాకు రూ.2 వేలు బోనస్ ఇస్తామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. లోగ్రేడ్‌కు రూ.110 అని ఆలోచన చాలా పొరపాటు నిర్ణయం అన్నారు. రైతులకు చాలా నష్టం కలిగించేదన్నారు. సరా సరి ధర కిలోకు రూ.250 కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ లలిత కుమారి మాట్లాడుతూ రైతాంగ పోరాటాలకు ప్రభుత్వాలు దిగి రాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా త్రోవగుంట వద్ద రైతు నాయకులను 32 మందిని, అలాగే టంగుటూరు టోల్ ప్లాజా వద్ద పదిమందిని పోలీసులు అరెస్టులు చేసి, పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జుజ్జురి జయంతి బాబు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరి నాంచార్లు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పమిడి వెంకట్రావు, సిపిఐ నాయకులు బూచి సురేష్, ఆర్ లక్ష్మి, టీ ప్రభాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు, కంకణాల ఆంజనేయులు, కంకణాల రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.













## బాగున్న రోడ్డుకు మట్టి గండం

### కోర్టు అప్రోచ్ రోడ్డు పక్కన వ్యర్థాల కుప్పలు





**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 29)**

మైదుకూరు టౌన్ పొద్దుటూరు రోడ్డులోని కోర్టుకు వెళ్లే అప్రోచ్ రోడ్డు ఎంతో బాగున్నా, దాని పక్కన పేరుకుపోతున్న మట్టి, వ్యర్థ పదార్థాలు మార్గం అందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి ప్రశాంతంగా, అందంగా ఉండాల్సిన కోర్టు మార్గం పక్కన ఇలా వ్యర్థాలు పేరుకుపోవడం పట్ల స్థానికులు, న్యాయవాదులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నాణ్యత బాగున్నప్పటికీ, దారికి ఇరువైపులా తెచ్చి పడేస్తున్న మట్టి, నిర్మాణ వ్యర్థాల వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడమే కాకుండా, కొద్దిపాటి గాలి వచ్చినా దుమ్ము ధూళి రేగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యాయదేవత నిలయానికి వెళ్లే ఈ ప్రధాన మార్గంలో ఇలా వ్యర్థాలు వేయడం వల్ల రోడ్డు శోభ దెబ్బతింటోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ సౌందర్యానికి, పారిశుధ్యానికి ప్రాధాన్యమిచ్చే మున్సిపల్ అధికారులు ఈ అప్రోచ్ రోడ్డు వైపు ఒకసారి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రోడ్డు బాగుంది కదా అని నిర్లక్ష్యం చేయకుండా, దాని పక్కన పేరుకుపోతున్న ఈ వ్యర్థాలను అరికట్టకపోతే దారి మరింత అధ్వానంగా తయారయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మున్సిపల్ కమిషనర్... కొంచెం దృష్టి పెట్టండి

కోర్టుకు వెళ్లే చక్కటి రోడ్డు పక్కన ఇలా మట్టి వ్యర్థాలు పేరుకుపోకుండా చూసే బాధ్యత మున్సిపల్ యంత్రాంగానిదే. ఈ కథనం ద్వారా మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, రోడ్డు పక్కన ఉన్న మట్టి వ్యర్థాలను తక్షణమే తొలగించాలని మైదుకూరు ప్రజలు కోరుతున్నారు. అలాగే ఇక పై అక్కడ ఎలాంటి వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకుని, బాగున్న రోడ్డు అందాన్ని కాపాడతారని ప్రజలు ఆశిస్తున్నారు. మరి ఏ విధంగా మున్సిపల్ అధికారులు స్పందిస్తారో వేచి చూద్దాం...!

## వేటపాలెం ఎంపీడీవోను కలిసిన తెలుగు యువత నేతలు



**(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, జులై 29)**

వేటపాలెం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పాశం రాజారావును చీరాల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దోగిపర్తి బాలకృష్ణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన మార్కాపురం జిల్లాలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశం

సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న మొట్టమొదటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావడం అధికారులు, సిబ్బంది అందరికీ ఒక అరుదైన అవకాశమని పేర్కొన్నారు. ఎటువంటి లోటుపాట్లు రాకుండా, ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆహ్వాన పత్రికలను ఎటువంటి అక్షర దోషాలు లేకుండా రూపొందించి, ముందస్తుగానే ఆహ్వానితులందరికీ అందజేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులకు గౌరవం: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, జిల్లాలోని సమరయోధులందరినీ ప్రత్యేక ఆహ్వానితులుగా గౌరవప్రదంగా వేడుకలకు ఆహ్వానించాలి. వేడుకలకు విచ్చేసే వృద్ధులు, మహిళలు, పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, నీడ, ప్రత్యేక సీటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించేలా శకటాలను రూపొందించాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 'సంజీవని' పథకంపై ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్‌ఓను ఆదేశించారు. జిల్లా ఆధ్యాత్మిక, జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన త్రిపురాంతకం, భైరవకోన, నెమలిగుండం, ఇష్టకామేశ్వరి, చెన్నకేశవ స్వామి ఆలయాల విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పేలా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో కచ్చితమైన సమయపాలన పాటించాలని, విధుల పట్ల విశేష ప్రతిభ కనబరిచిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, సిబ్బందికి వేడుకల రోజున బహుమతులు ప్రధానం చేయబడతాయని తెలిపారు. వేడుకల నిర్వహణకు 15 రోజులకు పైగా సమయం ఉన్నందున, అధికారులందరూ ఒక బృందంగా పనిచేసి, ఎటువంటి చిన్న పొరపాటుకు తావివ్వకుండా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట శివరామిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల సౌకర్యాలను త్వరితగతిన పూర్తి చేయండి

కాలనీల్లో వసతులు, పరిహారం పంపిణీలో నెలకొన్న పెండింగ్ అంశాలపై వెలుగొండ ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు, డ్వామా, ఐసీడీఎస్, డీఆర్డీఏ అధికారుల తో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సెప్టెంబర్ లో ప్రాజెక్టును ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందించిన నేపథ్యంలో ఆ దిశ గా అధికారులు అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ 1, టన్నెల్ 2 పనులు ఏ దశలో ఉన్నాయి, వాటి పూర్తికి ఇంకా ఎంత సమయం పడుతుంది వంటి అంశాలను ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పునరావాస కాలనీలో మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. దీని విషయంలో అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని తేల్చి చెప్పారు. అదే విధంగా పరిహారం నగదు పంపిణీకి సంబంధించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఐసీడీఎస్, డ్వామా, డీఆర్డీఏ అధికారుల సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా ఈ ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, వెలుగొండ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, డ్వామా పీడీ సువార్త, ఐసీడీఎస్ ఇంచార్జి పీడీ పద్మావతి, డీఆర్డీఏ పీడీ శివన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 29)**

కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు అయిన సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇప్పటివరకు ప్రజలకు ఏం చేశామో ప్రత్యక్షంగా ఓటర్లను కలిసి వివరించేందుకు ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఒంగోలు నియోజకవర్గం నందు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆదేశాల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా డివిజన్‌లోని బూత్ నందు ఉన్న ప్రజలను డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు కలవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరం 23వ డివిజన్ 107వ బూత్ నందు ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, ఇప్పటి వరకు కూటమి అమలుపరిచిన పథకాలను ప్రజలకు వివరిస్తూ, ఒంగోలు నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేస్తూ, త్వరలో ప్రజలకు అమలు పరచబోయే అభివృద్ధి పనులను ప్రజలకు 23వ డివిజన్ తెలుగుదేశం పార్టీ డివిజన్ నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ అధ్యక్షులు వలివేటి పవన్ కుమార్, ఒంగోలు పార్లమెంట్ ఐటిడిపి ప్రధాన కార్యదర్శి గోపు వీరాంజనేయులు, 107వ బూత్ ఇంచార్జి పబ్బిశెట్టి రాము, 107వ బూత్ కో ఇంచార్జి వాయల మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

## ముండ్లమూరులో మీకోసం మారెళ్ళ గ్రామంలో పల్లెనిద్ర

ఆయన కోరారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ముండ్లమూరు మండలంలోని మారెళ్ళ గ్రామంలో ' పల్లెనిద్ర ' చేస్తారు. గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అందుతున్న తీరు, స్థానిక సమస్యల పై ఆరా తీయనున్నారు. రాత్రి అదే గ్రామంలో బస చేస్తారు. 'పల్లెనిద్ర' లో గ్రామస్తులు ప్రస్తావించిన స్థానిక సమస్యలను మరసటి రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తారు. పల్లెనిద్ర కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

# ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యుని సేవలు భేష్ అసుపత్రికి కూలర్ బహూకరణ

(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 29)

బుధవారం పర్చూరు మండలంలోని ఉప్పుటూరు గ్రామం నందలి ప్రభుత్వ హోమియో వైద్యశాల నందు ప్రభుత్వ హోమియో వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ దాసరి చంద్రశేఖర్ రోగులకు వైద్య సేవల పట్ల చూపే శ్రద్ధను మరియు అంకిత భావాన్ని అభినందిస్తూ మేదరమెట్ల గ్రామానికి చెందిన షేక్ సలీం ఎయిర్ కూలర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల నందు గత మూడు నెలలుగా తన కుమారుడు అబ్దుల్ రాయన్ ఫిట్స్కు హోమియో వైద్యం పొందుతున్నాడని, తన కుమారుడు పుట్టుక నుండే ఫిట్స్తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాడని, ఎన్నో ప్రైవేట్ ఆసుపత్రులలో చూపించినా ఆశించిన ఫలితం దక్కలేదని. చివరికి, తన బంధువులు చెబితే మేదరమెట్ల నుండి ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాలకు వచ్చామని, గత కొంతకాలంగా ఇక్కడ తీసుకుంటున్న చికిత్స వల్ల బాబు ఆరోగ్య పరిస్థితిలో గణనీయమైన మార్పు వచ్చిందని, ప్రస్తుతం ఫిట్స్ సమస్య నుండి బాబుకు చాలా ఉపశమనం లభించిందని, ఇప్పుడు ఫిట్స్ మాటిమాటికి రావడం లేదని, ఫిట్స్ వస్తే ఉండే సమయం కూడా తక్కువ అయిందని, గతంలో రోజు మార్చి రోజు వచ్చేవని, కానీ ప్రస్తుతం నెల రోజులకు లేక 15 రోజులకు ఒకసారి కనబడుతున్నాయని, ఇక్కడ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అంకితభావంతో,



రోగుల పట్ల ఆయన చూపించే శ్రద్ధ తమను ఎంతగానో ఆకట్టుకుందని, ఇక్కడ కనీస మౌలిక వసతులు లేకపోయినా డాక్టర్ చక్కని వైద్యం అందిస్తున్నారని, ఆయనకు ఎండల నుంచి కొద్దిపాటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో, ఆయన నిరంతర సేవలకు కృతజ్ఞతగా తన వంతు సాయంగా ఒక ఎయిర్ కూలర్‌ను స్వచ్ఛందంగా బహూకరించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ హోమియో వైద్యశాలకు వస్తున్న రోగులు, ఉప్పుటూరు గ్రామస్తులు చూపిస్తున్న ఆదరాభిమానాలకు తాను నిరంతరం కృతజ్ఞుడనై ఉంటానని, ఈ రోజుల్లో కూడా ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి ప్రభుత్వ వైద్యశాలకు సహకరించడం సర్వత్రా ప్రశంసనీయమని, ఈ సంఘటనలు తనకు ఎంతగానో ఆనందాన్ని కలిగిస్తున్నాయని, త్వరితగతిన ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల నిర్మాణం పూర్తయితే తాను ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం లభిస్తుందని, ప్రస్తుతం రోగులు సుదూర ప్రాంతాల నుంచి కూడా వస్తున్నారని, కానీ రోగులు కూర్చునేందుకు కూడా కనీస మౌలిక సదుపాయాలు లేక అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తారు రోడ్డు, బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 29)

పేర్నమిట్ట గ్రామం నుండి పెద్ద కొత్తపల్లి గ్రామం వరకు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న తారు రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల నాణ్యత, పురోగతి పై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి వర్షాకాలం రాబోయే సరికి బ్రిడ్జి పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా రోడ్డును కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులకు సూచించారు. ఈ రహదారి పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్), ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు బుగ్గ లింగయ్య సతీమణి మృతి

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూలై 29)

పొదిలి ప్రాంతంలో చిరకాలంగా సీనియర్ పాత్రికేయులుగా పనిచేసిన స్వర్గీయ బుగ్గ లింగయ్య సతీమణి జె కె లక్ష్మీదేవమ్మ (95) బుధవారం తనువు చాలించారు. పొదిలి మూడు మండలాల్లో సీనియర్ జర్నలిస్టుగా ఆంధ్రప్రభ దిన పత్రిక విలేకరిగా పనిచేసిన బుగ్గ లింగయ్య ఈ ప్రాంత రాజకీయ నాయకులకు, అధికార యంత్రాంగానికి సుపరిచితులు. వారి సతీమణి మరణం జర్నలిస్టు కుటుంబాల్లో విషాదం నింపింది. వారి కుమారుడు జెకె విశ్వనాథం ప్రస్తుతం సివిఆర్ న్యూస్ ఎలక్ట్రానిక్ మీడియాలో న్యూస్ రిపోర్టర్ గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వేటపాలెంలో రెండేళ్ల నమ్మకానికి విశేష స్పందన



(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, జులై 29)

వేటపాలెం గ్రామపంచాయతీ నందు బుధవారం రెండేళ్ల నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వీరభద్రయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దొగిపర్తి బాలకృష్ణలు పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని, ఎమ్మెల్యే కొండయ్య నేతృత్వంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగాయని వారు ప్రజలకు తెలియజేశారు. రెండు సంవత్సరాల కాల వ్యవధిలోనే దాదాపుగా 80 శాతం అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. ఈ కార్యక్రమం పై ప్రజల్లో విశేష స్పందన రావడంతో కార్యక్రమాన్ని మరింతగా ముందుకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పోతురాజు, మండల యువత అధ్యక్షులు నాగు, బూత్ కన్వీనర్ శ్రీనివాసరావు, లాల్ అహ్మద్, షేక్ సుభాని, శ్రీహరి, మాచర్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి చర్యలు

### ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలన

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 29)

మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక వసతుల కల్పన, నూతన భవన నిర్మాణంపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారు. కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరడం, తరగతి గదులు, ప్రయోగశాలల కొరతపై స్పందించిన ఆయన, బుధవారం కళాశాలను ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఐఏఎస్ గారిని వెంటనే కళాశాలకు ఆహ్వానించారు. ఎమ్మెల్యేతో కలిసి కళాశాలను పరిశీలించిన కలెక్టర్‌కు అక్కడ నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, భవనాల మరమ్మతుల అవసరాన్ని ఎమ్మెల్యే వివరించారు.



**అత్యవసర ప్రాతిపదికన నిధుల మంజూరు..**

ఎమ్మెల్యే విజ్ఞప్తిపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సానుకూలంగా స్పందించారు. కళాశాలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను అత్యవసర ప్రాతిపదికన మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా, నిలిచిపోయిన నూతన కళాశాల భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

**విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే పుట్టా**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, ఆధునిక విద్యా వాతావరణాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మైదుకూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలను దశలవారీగా అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తును అందిస్తామని స్పష్టం చేశారు.





## కరేడు ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 29)

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరేడు నందు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ కోర్సులకు అడ్మిషన్లు నిర్వహించుటకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ, సీఈసీ , హెచ్ఈసీ, ఆర్ట్స్ గ్రూపులకు ప్రవేశాలు కల్పించబడనున్నాయి. చదువును మధ్యలో నిలిపివేసిన వారు, ఉద్యోగులు, గృహిణులు, ఇతర కారణాల వల్ల సాధారణ విద్యను కొనసాగించలేకపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉలవపాడు మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈవో1) పివి రత్నం, (ఎంఈవో2) పీవీ రమణయ్యచే ప్రచార పత్రాలు, గోడ పత్రికలు ఆవిష్కరించారు. అర్హులైన విద్యార్థులు, ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరేడు ప్రధానోపాధ్యాయులు పొన్నూరు శ్రీనివాసులుని సంప్రదించి అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు ఎస్ కే సలీం బాషా, జనార్ధన్‌రావు, లక్ష్మోజీ, ఉపాధ్యాయులు పిగిలి శ్రీనివాసులు, పోలుబోయిన రామకోటయ్య, రాయపాటి రాజశేఖర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా డాక్టర్ సి నారాయణరెడ్డి జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 29)

మండల కేంద్రమైన ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు సాహితీ జగత్తులో తన కవితా పటిమతో విశ్వవ్యాప్త ఖ్యాతిని గడించిన జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి లక్ష్మీ సుధారాణి మాట్లాడుతూ పద్యం, గేయం, వచన కవిత్వం, లలిత గీతాలు, సినిమా పాటలతో తెలుగు భాషకు సరికొత్త శోభను సమకూర్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి సింగిరెడ్డి నారాయణరెడ్డిని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు వై. సుధాకర బాబు మాట్లాడుతూ నారాయణరెడ్డి సాహితీ ప్రస్థానంలో ముఖ్యాంశాలను వివరించారు.విశ్వంభర కావ్యంలో మానవ వికాస పరిణామాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన తీరును వివరించి 'విశ్వంభర' కావ్యానికిగాను ఆయన అత్యున్నత సాహితీ పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును అందుకున్నారని వివరించారు. 'గులేబకావళి కథ' చిత్రం ద్వారా సినీ ప్రస్థానం ప్రారంభించి, వేలాది గీతాలతో పామరులను, పండితులను ఓలలాడించారని, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన చూపిన సాహితీ మార్గం, అందించిన అక్షర సంపద తరతరాల తెలుగువారికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# దశాబ్దాల సాగునీటి కల సాకారం

## రూ.8.90 కోట్లతో తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకానికి శ్రీకారం
## వైభవంగా శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
## స్వయంగా జేసీబీ ఎక్కి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్
## రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 29)**

మైదుకూరు నియోజకవర్గ వ్యవసాయ చరిత్రలో మరో సువర్ణాధ్యాయం లిఖించబడింది. ఎన్నో ఏళ్లుగా నీటి చుక్క కోసం, సాగునీటి కోసం ఎదురుచూస్తున్న తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె గ్రామాల రైతుల దశాబ్దాల నిరీక్షణకు నేటితో తెరపడింది. ఈ రెండు గ్రామాల రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.8 కోట్ల 90 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ' తిప్పిరెడ్డిపల్లె- ముదిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకం ' పనులకు నేడు అత్యంత వైభవంగా శంకుస్థాపన జరిగింది.

**కోలాహలంగా శంకుస్థాపన మహోత్సవం**

ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ గారు, కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, సాంప్రదాయ పూజా కార్యక్రమాల నడుమ ప్రాజెక్టు శంకుస్థాపన రాయిని ఆవిష్కరించి, పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ,కలెక్టర్ ,స్వయంగా జేసీబీ యంత్రంపైకి ఎక్కి పనులను ప్రారంభించడం అక్కడ గుమికూడిన ప్రజలను, రైతులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు నేరుగా రంగంలోకి దిగి చూపిన ఈ ఉత్సాహం స్థానిక రైతుల్లో కొండంత ధైర్యాన్ని, సంతోషాన్ని నింపింది. కూటమి ప్రభుత్వం హామీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, చేతల్లో చూపిస్తుందనడానికి ఈ ఘట్టమే సజీవ సాక్ష్యమని ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

**వేలాది ఎకరాలకు సాగునీరు**
**రైతన్నల ముఖాల్లో చిరునవ్వులు**

ఈ ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయిన తర్వాత తిప్పిరెడ్డిపల్లె, ముదిరెడ్డిపల్లె చెరువులు సమృద్ధిగా నీటితో నిండనున్నాయి. ఫలితంగా ఈ ప్రాంతంలోని వేలాది ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందనుంది. నీటి కొరత తీరడంతో పంటల ఉత్పాదకత గణనీయంగా పెరిగి, రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఆనందబాష్పాలతో కృతజ్ఞతలు తెలిపిన గ్రామీణులు**

ప్రాజెక్టు పనులు కళ్లెదుటే ప్రారంభం కావడంతో గ్రామాల



రైతులు, నియోజకవర్గ ప్రజలు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తరతరాలుగా మేము అనుభవిస్తున్న సాగునీటి తిప్పలను అర్థం చేసుకుని రూ.8.90 కోట్లతో ప్రాజెక్టు మంజూరు చేయించి పనులు ప్రారంభించిన మా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి జీవితాంతం రుణపడి ఉంటాం. మా కల నెరవేర్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

**రైతు సంక్షేమమే ధ్యేయం**
**ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది. గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వానికి రైతుల సంక్షేమమే పరమావధి. ఇచ్చిన మాట ప్రకారం తిప్పిరెడ్డిపల్లె-ముదిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి ఎకరాకూ నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.








# భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడిగా కె బుచ్చేశ్వర్‌రావు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 29)**

భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులుగా కె బుచ్చేశ్వర్‌రావు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని జాతీయ డైరెక్టర్ షైక్ సిద్దాంభి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ భారతీయ జనతా మజీదూర్ సంఘ్ కృషి చేస్తుందన్నారు. సామాజిక సేవా రంగంలో కృషి చేస్తూ ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కె బుచ్చేశ్వర్‌రావును ప్రకాశం జిల్లా డీజే ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడుగా నియమించటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆమె కోరారు. నియామక పత్రం అందుకున్న కె బుచ్చేశ్వర్ రావు మాట్లాడుతూ తన పై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను కార్మికుల అభివృద్ధి, సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు. అందరం కలిసికట్టుగా భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ చేపడుతున్న కార్యక్రమాలకు కృషి చేద్దామన్నారు. దేశంలో ఎంతో మంది కార్మికులకు కనీస భద్రత కరువైందని, వారికి అందవలసిన హక్కులు ఇంకా రావడంలేదన్నారు. ప్రతి ఒక్కరూ కార్మికుల సంక్షేమ, అభివృద్ధి కోసం కృషి చేసి భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ లక్ష్యం నెరవేరేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విలువలతో పనిచేస్తూ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న షేక్ సిద్ధాంభి ఎంతో మందికి సేవలందిస్తూ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి యన్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షలు షైక్ ఖాసీం వలి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల విస్తృత ప్రచారం



**(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 29)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనలతో కంభం మండలం అర్బన్ కాలనీలోని 61వ బూత్ పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం కొనసాగించారు. 61వ బూత్ ఇంచార్జి జేడీ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో 10వ బూత్ ఇంచార్జి సయ్యద్ నూరుల్లా ఖాద్రి పాల్గొని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

# మైదుకూరు చిన్న సాయిబాబా ఆలయంలో వైభవంగా గురుపౌర్ణమి ఉత్సవాలు



**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 29)**

పట్టణంలోని సాయినాథపురంలోని ప్రసిద్ధ చిన్న సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచామృతాలు మరియు సుగంధ ద్రవ్యాలతో భక్తులు స్వహస్తాలతో ఉదయపు అభిషేకం నిర్వహించారు.

**అధ్యక్షునికి ఘన స్వాగతం – ఊరేగింపు**

ఉదయపు అభిషేకం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సాయిబాబా గుడి కమిటీ అధ్యక్షులు కరమలపుటీ సుబ్బరాయుడు నివాసానికి వెళ్లి, గురుపౌర్ణమి ఉత్సవాలకు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పూలదండలతో ఘనంగా గౌరవించారు. అనంతరం అక్కడి నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా (మెరవణిగా) ఆయనను సాయిబాబా గుడికి తోడ్కొని వచ్చారు.

**విశేష పూజలు – అన్నదాన కార్యక్రమం**

అనంతరం ఉదయం 11 గంటలకు స్వామివారికి విశేష అభిషేకం, శోభాయమానమైన అలంకరణ గావించారు. ఆలయ ప్రాంగణం భక్తుల ఓం శ్రీ సాయినాథాయ నమః "సాయిరామ్" నామస్మరణలతో మారుమోగింది. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ విశేష అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో శిరిడి సాయిబాబా దేవస్థానం అధ్యక్షులు కరమలపుటీ సుబ్బరాయుడుతో పాటు కార్యవర్గ సభ్యులు బాల వీరయ్య, కోట అశోక్, చేదెల సత్య, టంగుటూరు సుధాకర్, తాటి సుబ్బరాయుడు, అయితరాజు లక్ష్మీ నరసయ్య, వైద్యనాథ్, రవి, వేణుగోపాల్ ఆచారి, సాయి, పుట్టా శివ, పబ్బతి గోపాల్, బొగ్గరపు గురు ప్రసాద్, రామాంజనేయులు, నేతి బంగారు రెడ్డయ్య, ఇతర కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.





# భారతరత్న కర్పూరి ఠాగూర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వితీయ ప్రాంతీయ సమావేశం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 29)**

భారతరత్న కర్పూరి ఠాగూర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వితీయ ప్రాంతీయ సమావేశం ఒంగోలులో జరుగుతుందని నాయి బ్రాహ్మణ సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ట్రస్ట్ ఉపాధ్యక్షులు డాక్టర్ హైమా సుబ్బారావు పిలుపునిచ్చారు. నగరంలోని ఒక సమావేశం మందిరంలో జరిగిన కరపత్ర ఆవిష్కరణకు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజానికి క్షవర, వాయిద్య, వైద్య సాంప్రదాయ వృత్తులను వేల సంవత్సరాల చేస్తూ సమాజానికి అనేక రకాల సేవలు అందిస్తున్న నాయి బ్రాహ్మణులు కుటుంబం పిల్లలు ఉన్నత స్థాయిలో ఎదిగి ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో ఈ ట్రస్టును ఏర్పాటు చేశామని చదువుకున్న విద్యార్థులు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ ట్రస్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. ఐఏఎస్ ఐపీఎస్ పోటీ పరీక్షల్లో పాల్గొనేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న వారిని ట్రస్ట్ ద్వారా చదివించి మంచి భవిష్యత్తును అందించాలని లక్ష్యంతో ఈ ట్రస్ట్ ని ఏర్పాటు చేశామని అన్నారు. ఆగస్టు 16వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులో గల అభిరామ్ రెసిడెన్సిలో ఈ సదస్సు జరుగుతుందని ఈ సదస్సుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి రామారావు ఐపీఎస్ రిటైర్డ్ అధికారి ఎం రవీంద్రనాథ్ బాబు తో పాటు అనేకమంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటారని అన్నారు. మెరిట్ విద్యార్థులకు ఈ సమావేశంలో స్కాలర్షిప్లు పంపిణీ జరుగుతుందని అందువలన సంఘాలకు అతీతంగా నాయి బ్రాహ్మణ సోదరి సోదరీమణులందరూ కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ సభ్యులు ఉప్పుటూరు ఆదినారాయణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ నిడమానులు రమేష్ మిరియాల రాఘవరావు, వల్లూరు కోటేశ్వరరావు, పిల్లుట్ల సుధాకర్, కేఎల్ నరసింహారావు, పి చిన్న వెంకటేశ్వర్లు, గుంటూరు ఏడుకొండలు, నిడమానూరుఎలమందరావు, గుంటూరు విజయ్, రామారావు మార్కాపురం రామారావు, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీగిరిలో శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 29)

శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. ప్రముఖ గాయని బి ఫణి దీప్తి అన్నమయ్య విరచిత సంకీర్తనలను మృదు మధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. ప్రతి ఆదివారం ఉదయం 9.30 గంటల నుండి 11 గంటల వరకు శ్రీగిరి దేవస్థానం గోక్షేత్ర భవన్‌లో శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులు జరుగుతాయని 17 సంవత్సరాల లోపు వయసు కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి

# వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు వేలాది మంది భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా దేవస్థానం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 29)



కనిగిరి షిరిడి సాయిబాబా దేవస్థానంలో బుధవారం సాయి బాబా అఖండ సాయి నామ సప్తాహం, గురుపౌర్ణమి సందర్భంగా వేడుకలు వైభవంగా జరిగాయి. సాయిబాబా దేవస్థానంలో వేలాది మంది భక్తులు సందర్శించి పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయి నాథునికి అభిషేకాలు, పూజలు, అలంకరణలు కాగడా, మధ్యాహ్నం హారతి కన్నులపండువగా నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గం ఇన్చార్జి దద్దాల నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు మడతల కస్తూరి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, సిరుప గోవర్ధన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. కనిగిరి పీఏసీఎస్ ఛైర్మన్ అద్దంకి రంగబాబు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ గౌరవ అధ్యక్షులు బోయిళ్ళ తిరుపతిరెడ్డి, కుందురు తిరుపతిరెడ్డి, అధ్యక్షులు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు ఓబులురెడ్డి, కోశాధికారి ముచ్చర్ల ధర్మారావు, సంయుక్త కార్యదర్శి కొలిపర్తి మారుతి కుమార్, సంయుక్త కోశాధికారి వాగిచెర్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నార్లపాటి సాంబశివరావు, వీసి రామశాస్త్రి, తంగుటూరి గోవిందరావు, సింగరాజు మాలకొండేశ్వరరావు, శ్రీరాం మురళి, ఏసీ చెంచులు కమిటీ సభ్యులు రాచమడుగు సంజీవయ్య, ఒంటేరు పెద్దన్న, బుసిరెడ్డి నాగేశ్వరరెడ్డి, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, జొన్నలగడ్డ మల్లికార్జునరావు, పల్లా మాలకొండ్రాయుడు, గాదంశెట్టి ప్రసాద్, మునగా ప్రసాద్, బైరపు కృష్ణ, బచ్చు వెంగళరావు గుప్తా, పాల్వాది జయరాం, జగదీష్, రాచర్ల నరేష్, ఇన్నమూరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.





# వైభవంగా గురు పౌర్ణమి మహోత్సవ వేడుక

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 29)



గురు పౌర్ణమి పర్వదిన సందర్భంగా శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం నెహ్రూ బజార్ మార్కాపురం నందు గురు పౌర్ణమి పర్వదిన వేడుకలు అత్యద్భుతంగా జరిగినవి. ఉదయం 5 గంటలకు కాకడ హారతి మొదలుకొని భక్తులు బారులు తీశారు మధ్యాహ్నం భక్త సందోహంతో మందిరం పరిసర ప్రాంతలు భక్త వాహినితో నిండిపోయినది. సుమారు ఇరవై వేల మంది భక్తులు సాయినాధుని దర్శించుకొన్నారు. కమిటీ వారు వచ్చిన భక్తులందరికి అన్న ప్రసాదం వితరణ జరిపారు. ఉదయం పంచామృత అభిషేకం, సాయి సత్య వ్రతాలు, మధ్యాహ్నం హారతి, సంధ్యహారతి విశేష పూజలు నిర్వహించారు. మార్కాపురం టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథరెడ్డి పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేసి భక్తులుకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సేవలు అందించారు. మునిసిపల్ కమీషనర్ డివిఎస్ నారాయణరావు వారి సిబ్బందితో మందిరం ప్రాంతం, అన్న ప్రసదా వితరణ వద్ద పరిశుభ్రం చేయించారు. రాత్రి పల్లకి ఉత్సవం ఘనంగా జరిగింది. మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు, సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. మందిరం ప్రధాన అర్చకులు రామకృష్ణచార్యులు విశేష పూజలు జరిపించారు. మాజీ ఎమ్మెల్యే జంకే వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైసీపీ వెన్నా హనుమారెడ్డి, మాజీ కౌన్సిలర్ చక్కా మధు, మాజీ వైస్ ఛైర్మన్ చాతరాజపల్లి శ్రీనివాస్, జేఏసీ ఛైర్మన్ బివిఎస్ శాస్త్రి, తదితరులు బాబాను దర్శించి పూజలు అందుకున్నారు. సుమారు 20వేల మంది భక్తులు బాబాను దర్శించుకున్నారు. మందిరం అధ్యక్షులు పేరం సత్య నారాయణ, కార్యదర్శి గోపాలుని హరిహర రావు, కోశాధికారి నాగరాజు, సహాయ కార్యదర్శి చల్లా పవన్, ఖరీం, గోపాలుని కృష్ణమోహన్, సకల నరసింహులు, పాలగిరి వెంకటేశ్వర్లు, నూకల శ్రీనివాస్, సాయి సుబ్బారావు, మధు, రంగ ప్రసాద్, విజయ్, గోపిశెట్టి కొండయ్య, రావిపాటి రామారావు, తదితరులు బొంతల భారతి, వరలక్ష్మి, గౌరీ, సుబ్బరత్నమ్మ, రమాదేవి మహిళా సభ్యులు, కనమర్ల పూడి మస్తాన్, శ్రీనివాసరెడ్డి, కజ్జాయం సుబ్రహ్మణ్యం, తదితరులు కార్యక్రమం నిర్వహించారు. మందిరం మేనేజర్ సతీష్ నాయుడు పర్యవేక్షణ చేశారు.

# సాయినాథునికి అభిషేకం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 29)

మండలంలోని రాజుపాలెం నేషనల్ హైవే పైన ఉన్న రత్న సాయి సురక్షత మందిరంలో బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా సాయినాధునికి అభిషేకం, అలంకరణ, పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి వేద ఆశీర్వచనాలు అందుకున్నారు.

# నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 29)



పొదిలి నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా బుధవారం రామ్మోహన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గొట్లగట్టు మాజీ సర్పంచ్ పెరికె సుఖదేవ్(బూన్), పొదిలి పట్టణ టీడీపీ నాయకులు తానికొండ వెంకట్రావులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# గురు పౌర్ణమి సందర్భంగా మహావీణ బృంద గానం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూలై 29)

గురు పౌర్ణమి సందర్భంగా సరయు మ్యూజిక్ అకాడమీ, వైజాగ్ వారి ఆధ్వర్యంలో ప్రశాంతి నిర్వహిస్తున్నటువంటి మహా వీణ బృందగానంలో ఒంగోలుకు సంబంధించిన శ్రీ లలితా గాయత్రీ సంగీత కళానిలయం గురువు టీ నాగలక్ష్మి శిష్య బృందం ఈ బృందంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తిరుమలలోని ఆస్థాన మండపంలో అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహిస్తున్నటువంటి ఈ కార్యక్రమంలో గురువు, శిష్య బృందమంతా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురువు నాగలక్ష్మితో పాటు కరవది నాగలక్ష్మి, నారపరాజు గీతా ప్రవల్లిక, రావిపూడి సాహితీ, సిద్ధా సుమన, గుడ్లదోన శ్యామల, కారంశెట్టి అనుజ్ఞ, యం మానసి, మొదలైన వారు పాల్గొని నిర్వాహకుల ద్వారా సర్టిఫికెట్స్, మెమెంటోలు అందుకోవటం జరిగింది. ఈ కార్యక్రమానికి సంకీర్తన ఆచార్య అన్నమాచార్య 11వ తరం వారైన పెద్ద తిరుమలాచార్యులు మనవడికి గురుపూజ కార్యక్రమం, వారి చేతుల మీదగా ప్రశంసా పత్రాలు అందుకోవటం జరిగింది.

# భక్తిప్రపత్తులతో గురు పౌర్ణమి వేడుకలు

## షిరిడి సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్ దంపతులు





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూలై 29)

పట్టణంలోని ఆధ్యాత్మిక శోభ నడుమ గురు పౌర్ణమి ఉత్సవాలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక దర్శి రోడ్ లోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానంలో పొదిలి నగర పంచాయతీ క్లస్టర్ ఇన్‌ఛార్జి వరికుంట్ల అనిల్ కుమార్, ఆయన సతీమణి సురేఖ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి శాస్త్రోక్తంగా అర్చనలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజలు ఆనందం వరికుంట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు, మార్కాపురం నియోజకవర్గ భక్తులందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. మార్కాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అందిస్తున్న సేవలను అనిల్ కుమార్ కొనియాడారు. నియోజకవర్గంలో ఎదురయ్యే ప్రతి ప్రజా సమస్య పైన అడుగడుగునా పోరాడుతూ వాటికి తక్షణ పరిష్కారం చూపుతున్న ఏకైక నాయకుడు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మళ్లీ అధికారం దిశగా నడిపించి ప్రజాసేవకే అంకితం అవుతానని స్పష్టం చేశారు. ఆ సాయిబాబా దీవెనలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుటుంబ సభ్యులకు, నియోజకవర్గ, పొదిలి మండల ప్రజలకు సంపూర్ణంగా ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సాయిబాబా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బస్సు ఏర్పాటుతో ఎరిక్షన్‌బాబుకు ధన్యవాదాలు తెలిపిన విద్యార్థులు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జులై 29)
యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎరిక్షన్ బాబు సహకారంతో కర్రోల గ్రామం నుండి కేంద్రీయ విద్యాలయం రాజంపల్లి వరకు బస్సు ఏర్పాటు చేసారు. ఈ బస్సు రావడంతో కరోల గ్రామ ప్రజలు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కేంద్రీయ విద్యాలయం రాజంపల్లి గ్రామంలో స్థాపించి పది సంవత్సరాలు అవుతుంది అప్పటినుంచి విద్యార్థులు రాకపోకలకు అవస్థలు పడుతూనే ఉన్నారు. ఈ విషయం ఇన్చార్జి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి బస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఎరిక్షన్ బాబుకి గ్రామ ప్రజలు తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

## అద్దంకి నియోజకవర్గంలో 24 అంగన్‌వాడీ భవనాలకు రూ.1.79 కోట్లు



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 29)
అద్దంకి నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 24 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ రూ. 1.79 కోట్ల నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నిధులతో అద్దంకి మండలంలో 9, జె.పంగులూరు మండలంలో ఒకటి, కొరిశపాడు మండలంలో 5, సంతమాగులూరు మండలంలో 9 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు పూర్తికానున్నాయని తెలిపారు. చిన్నకొత్తపల్లి, ధర్మవరం, నాగులపాడు, కొటికలపూడి (శ్రీరామ్‌నగర్), కొంగపాడు, శింగరకొండపాలెం, మోదేపల్లి (నన్నూరుపాడు), మైలవరం (ఏలేశ్వరవారిపాలెం), వెంపరాల, ముప్పవరం బీసీ కాలనీ, బొడ్డువానిపాలెం, ప్రాసంగులపాడు, రాచపూడి, కుందూరు, కొమ్మాలపాడు, మక్కెనవారిపాలెం, ఏల్చూరు తదితర ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ నిధులు కేటాయించినట్లు వివరించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలను దశలవారీగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, మిగిలిన అసంపూర్తి భవనాలకు కూడా దశలవారీగా నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

# నూతన కమిషనర్‌గా రామ్మోహన్‌రావు బాధ్యతలు స్వీకరణ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 29)
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 6 గురు కమిషనర్లు బాధ్యతలు స్వీకరించారు. ఒకరిద్దరు మినహా మిగిలిన వారెవరూ పొదిలి అభివృద్ధిలో పాలుపంచుకున్న దాఖలాలు లేవు. అయితే నూతనంగా పొదిలి నగర పంచాయతీ 7వ కమిషనర్‌గా రామ్మోహన్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పొదిలి గ్రామ పంచాయతీ ఈఓ గా పని చేసిన అనుభవం ఉంది. దీంతో పొదిలి నగర పంచాయతీ అభివృద్ధి కి తనదైన మార్క్ పాలన సాగించే అవకాశం ఉందని ప్రజలందరూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ మాట్లాడుతూ గతంలో పొదిలి ఈఓగా పని చేసిన కాలంలో తనకు పొదిలి పట్టణంలోని పరిస్థితులు తెలుసన్నారు. కావున నగరపంచాయతీగా రూపాంతరం చెందిన తర్వాత ఆ దిశగా అభివృద్ధి కూడా చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా అధికారులు, స్థానిక నాయకుల సహకారంతో పొదిలి నగర పంచాయతీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, నగరపంచాయతీ అధికారులు, సిబ్బంది ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.

**కలెక్టర్‌ను కలిసి కమిషనర్**

మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం విజయసునీతను పొదిలి నగర పంచాయతీ నూతన కమిషనర్ రామ్మోహన్‌రావు బుధవారం మధ్యాహ్నం మార్కాపురంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.








## తర్లుపాడులో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 29)
మండల కేంద్రమైన తర్లుపాడు లోని స్థానిక షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు ఆలయ ట్రస్ట్ ఛైర్మన్, రిటైర్డ్ తహశీల్దార్ మాదాల నాగ మల్లికార్జున్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని, పరిసర గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొందరు భక్తులు మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని సముపార్జించే గురువులను పూజించే పవిత్ర పర్వదినాన్నే గురుపౌర్ణమి అంటారు. ఈ వేడుక ఆషాడ శుద్ధ పౌర్ణమి రోజులు జరుపుకుంటాం. దీనినే వ్యాస పౌర్ణమి అంటారు. మహాభారతాన్ని అష్టాదశ పురాణాలను రచించి వేదాలను నాలుగు భాగాలుగా విభజించిన ఆది గురువు మహర్షి వేదవ్యాసుడు ఈ పౌర్ణమి రోజే జన్మించారని పురాణాలు చెబుతున్నాయన్నారు. ముందుగా షిరిడి సాయిబాబా మందిరంలో అధిక సంఖ్యలో భక్తులు చేరుకుని పూజలు, అభిషేకాలు అతి పవిత్రంగా చేశారు. అనంతరం దాతలు సహకారంతో



భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ మాదాల మల్లికార్జునరావు, మాదాల చిన్న మల్లయ్య, ఎం శంకర్, ఎం కోటేశ్వరరావు, డిఏఓ రవీంద్రారెడి, మార్కాపురం తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, విద్యుత్‌శాఖ అధికారులు, మార్కాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వెన్న హనుమారెడ్డి, కుందురు పెద్దకాశిరెడ్డి, కుందురు చిన్నకాశిరెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ నడికట్టు కృష్ణారెడ్డి, రిటైర్డ్ చర్కోలగట్ల నారాయణరెడ్డి, నెహ్రూ యూత్ మండల అధ్యక్షుడు బి పుల్లయ్య, బొందలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్, వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షుడు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.



## సాయిబాబా ఆశీస్సులతోనే నిరంతర ప్రజాసేవ

### గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన సత్కారం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 29)
షిరిడీ సాయిబాబా దివ్య ఆశీస్సులతోనే ఇన్నేళ్లుగా ప్రజలకు నిరంతరం అండగా ఉండగలుగుతున్నానని పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా తెలిపారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక దర్శి రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబావారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకోవడంతో పాటు, రాష్ట్ర ప్రజలు, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు చెప్పారు.ఎఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమాంసా మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా ఆర్ఎంపీ వైద్యుడిగా నిరుపేదలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే తమ ఆసుపత్రికి శ్రీ సాయి క్లినిక్ అని పేరు పెట్టుకున్నానని, బాబాపై ఉన్న అపారమైన నమ్మకంతోనే ఇప్పటివరకు తనకు ఎటువంటి కష్టాలు రాలేదని పేర్కొన్నారు. వైద్య వృత్తితో పాటు తెలుగుదేశం పార్టీలో కీలక నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నానని గుర్తుచేశారు. ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను గుర్తించి ఉమ్మడి ప్రకాశం జిల్లా అసోసియేషన్ నాయకులందరూ తనను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని, నాటి నుంచి నేటి వరకు ప్రజల ఆదరణ తగ్గకపోవడం సాయిబాబా కరుణేనని వ్యాఖ్యానించారు. పూజా కార్యక్రమాల అనంతరం సాయిబాబా దేవస్థానం కమిటీ నిర్వాహకులు చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసాను శాలువాతో ఘనంగా సత్కరించి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా బాబా ఆశీస్సులతో ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఈ సందర్భంగా చైర్మన్ ఇమాంసా స్పష్టం చేశారు.



## ఎరిక్షన్ బాబుకు బ్రహ్మారథం
## ప్రజా సంక్షేమ ధ్యేయమే ఓటమి ప్రభుత్వం లక్ష్యం

### – ఇంటింటికీ తెలుగుదేశం – ప్రజలతో మమేకమైన గూడూరి ఎరిక్షన్ బాబు

(షణ్ముఖ వెలుగు, దోర్నాల, జులై 29)
మండలంలోని బోడె నాయక్ తండాలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా లియర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలుసుకుని, పార్టీ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలనులి గ్రామ ప్రజలకు వివరించి, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు తండాలో ఉన్న రాములవారి దేవాలయం లోలి తండా సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సమావేశంలో గత రెండేళ్లుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, తల్లికివందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల టీడీపీ అధ్యక్షులు షేక్ మహబూబ్ సాహెబ్, మండల కూటమి నాయకులు బోడె నాయక్, తండా పంచాయతీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మహిళల ఆరోగ్య పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ

# 'ఉమెన్ ఫస్ట్' ప్రచారాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 29)

మహిళల ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత నివారణ, మాతా శిశు సంక్షేమం వంటి అంశాల్లో ప్రతి గ్రామంలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా 'ఉమెన్ ఫస్ట్' ప్రచార కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జేసీ డాక్టర్ నిధి మీనాతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వివిధ శాఖల అధికారులతో 'ఉమెన్ ఫస్ట్' కార్యక్రమ అమలు కార్యాచరణ పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యాభివృద్ధే కుటుంబం, సమాజం, భావితరాల అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొంటూ వైద్య ఆరోగ్యం, ఐసీడీఎస్, విద్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో బాలికలు, గర్భిణులు, బాలింతలు, పునరుత్పత్తి వయస్సు మహిళలు, రజోనివృత్తి అనంతర మహిళలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. రక్తహీనత నివారణ, యుక్తవయస్సులో గర్భధారణ నియంత్రణ, గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ, తక్కువ బరువుతో శిశువుల జననాల తగ్గింపు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో మహిళలకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలుగు భాషలో సమాచార పుస్తకాలు, పోస్టర్లు, ఆడియో విజువల్ ప్రచార సామగ్రి సిద్ధం చేసి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. స్వయం సహాయక సంఘాల సమావేశాలు, గ్రామ ఆరోగ్య, పోషకాహార దినోత్సవాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోషకాహారం పై ప్రత్యేక దృష్టి సారించేందుకు ప్రత్యేక న్యూట్రిషన్ సెల్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి నెలా నిర్దేశిత సూచికలను సమీక్షిస్తూ కార్యక్రమ పురోగతిని అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో ఆరోగ్య పరీక్షలు, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్, కమ్యూనిటీ తోటల ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు ఒకే కమాండ్ వ్యవస్థతో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేస్తే మహిళల ఆరోగ్య సూచికల్లో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, మహిళల సాధికారతతో పాటు ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు ప్రొఫెసర్లు వర్చువల్‌గా హాజరవ్వగా ఐసిడిఎస్ పీడి రమాదేవి, డీఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఇంచార్జి డిఎంహెచ్‌ఓ రవిబాబు, ఏపిసి ఎస్ఎస్ఏ అనురాధ, డిఈవో శంశుద్దీన్, వైద్యులు, న్యూట్రిషన్ శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ఎయిర్‌పోర్టు ప్రారంభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూలై 29)

విజయనగరం జిల్లా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆగస్టు 1వ తేదీన జరగనున్న ప్రారంభ ఏర్పాట్లను మంత్రులు కె అచ్చెంనాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు బీద రవిచంద్ర, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తదితర నేతలతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. సభా వేదిక, వీఐపీల ప్రవేశం, పార్కింగ్, భోజన ఏర్పాట్లు సహా అనేక అంశాల పై చర్చించారు.

## 30వ డివిజన్‌లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 29)

ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ఆదేశాల మేరకు 30వ డివిజన్‌లో బుధవారం ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నత్తల కనకారావు, డివిజన్ అబ్జర్వర్ పాలపర్తి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొల్లా బత్తిన రమేష్, డివిజన్ ఉపాధ్యక్షులు కాకుమాని రాజేష్, బూత్ కన్వీనర్ కొమ్ము సురేష్, కో కన్వీనర్ బల్లికుర ప్రదీప్, కాకుమాని అనిల్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం సంక్షేమ కార్యక్రమం నిర్వహించిన టీడీపీ నాయకులు



(షణ్ముఖ వెలుగు, కంభం, జూలై 29)

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశానుసారం కంభం గ్రామపంచాయతీ పరిధిలోని 54వ బూత్‌లో కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన పనులు పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ కార్యదర్శి, మాజీ ఎంపిటిసి సభ్యులు సయ్యద్ అనీస్ అహమ్మద్, ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ వార్డ్ మెంబర్ అతార్ షేక్ హుస్సేన్ (దాదా), సీనియర్ నాయకులు షేక్ ఫజల్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ జిలాని, ఐటీడీపీ మండల అధ్యక్షుడు షేక్ ఫయాజ్, ఐటిడిపి యూత్ ఆనంద్, బాబా ఫక్రుద్దీన్, హైటెక్ హోటల్ మున్నా, సయ్యద్ మజ్, తదితరులు పాల్గొన్నారు.

# హజ్ భవన్‌కు సరికొత్త నైపుణ్య రూపం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

## స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 29)



చెన్నూరు మండలం రామనపల్లి గ్రామంలోని హజ్ భవన్‌ను ఆధునిక లిస్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లిగా అభివృద్ధి చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందించే కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సన్నాహక చర్యలు వేగవంతం చేయడం జరుగుతోందనని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం రాత్రి కలెక్టర్ ఛాంబర్‌లో తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి నిర్వహించిన సమీక్ష సమావేశంలో హజ్ భవనం నిర్మాణ పురోగతి, మిగిలిన పనులు, అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక మార్పులు, భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా చర్చించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి హిదాయతుల్లా, హజ్ భవన్ నిర్మాణం ప్రస్తుత స్థితి, ఇప్పటికే పూర్తయిన పనులు, మిగిలిన నిర్మాణ కార్యక్రమాలు, భవనాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా అభివృద్ధి చేయడానికి రూపొందించిన ప్రతిపాదనలు, అవసరమైన శిక్షణా సౌకర్యాలు, వ్యయ అంచనాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం భవనం నిర్మాణ నమూనా, శిక్షణ కార్యక్రమాలకు అనుగుణంగా అవసరమైన సాంకేతిక మార్పులు, తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన మార్పులు, చేర్పులపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో వచ్చిన సూచనలకు అనుగుణంగా సవరించిన ప్రణాళికలు, సాంకేతిక అంచనాలు త్వరితగతిన సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సవరించిన ప్రతిపాదనలు అందిన వెంటనే వాటిని ప్రభుత్వానికి పంపించి, హజ్ భవన్‌ను ఆధునిక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా అభివృద్ధి చేసేందుకు అవసరమైన పరిపాలనా అనుమతులు, నిధుల మంజూరుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జి డిఆర్వో వెంకటపతి, ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ కుమార్, స్కిల్ డెవెలప్మెంట్ జిల్లా కో ఆర్డినేటర్ వినీల్ కుమార్, పీఆర్ ఎస్ఈ మద్దన్న, కడప ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రస్తుత కాంట్రాక్టర్ ఎవి మోహన్ రెడ్డి, ఆర్కిటెక్ట్ విజయ్, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి, తదితరులు పాల్గొన్నారు.



# చౌటపాలెంలో ఇంటింటికి టిడిపి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూలై 29)

మండలంలోని చౌటపాలెం గ్రామంలో బుధవారం ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండల టిడిపి నాయకుడు కర్ణ కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇచ్చిన హామీలు నెరవేర్చని ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి దక్కుతుందని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించి అభివృద్ధి,సంక్షేమ గురించి వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు గుమ్మల్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, అనుమోలు సుధాకర్‌బాబు, పల్లపుతు రమేష్‌బాబు, ఉన్నం శ్రీనివాసరావు, పాతూరి కోటయ్య, చల్ల శ్రీనివాసరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





## కరేడు వైద్యశాలను సందర్శించిన వైద్యాధికారిణి శ్రీజా రెడ్డి








(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 29)

మండల కేంద్రమైన ఉలవపాడు లోని సోషల్ వెల్ఫేర్ బాలికల, బాలుర వసతి గృహాలను బుధవారం కరేడు వైద్యాధికారిణి శ్రీజా రెడ్డి సందర్శించారు. వసతిగృహాలలో ఉన్న విద్యార్థుల యొక్క ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని వారికి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించడం జరిగింది. వ్యాధులు రాకుండా ముందుగానే విద్యార్థులందరూ పరిశుభ్రంగా ఉండాలని వివరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. అలాగే హాస్టల్ పరిసరాలు పరిశీలించడం జరిగింది. ఎక్కడ అపరిశుభ్రంగా ఉండకూడదని హాస్టల్ వార్డెన్‌కి సూచించారు. విద్యార్థుల యొక్క వంటశాలను కూడా పరిశీలించి వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తగు సూచనలు చేయడం జరిగింది. విద్యార్థులకు చిన్న వ్యాధులకు చికిత్స చేయడం జరిగింది. బాలికల హాస్టల్ నందు విద్యార్థినులకు ఎత్తు, బరువుతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రమాదేవి, నగేష్, దివ్యత, ఆరోగ్య కార్యకర్తలు పద్మ, అల్తాఫ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.